## గుడ్డును అర గంట ఉడికించడమే ఉత్తమం!

**ఎక్కువ పోషకాలు లభించాలంటే ఇలా చేయాలంటున్న తాజా అధ్యయనం**



వాషింగ్టన్: ఇకపై గుడ్డు నుంచి ఎక్కువ పోషకాలు మీకు లభించాలంటే దాన్ని ఉడకపెట్టడంపై దృష్టి పెట్టాల్సిందేనంటున్నారు అమెరికా శాస్త్రవేత్తలు! పచ్చ సొన, తెల్ల సొనలను ఒకే ఉష్ణోగ్రత వద్ద ఉడికించకూడదని చెప్తున్నారు. గుడ్డును ఎలా ఉడికించాలో తమ అధ్యయనంలో గుర్తించారు. 'కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, పచ్చ సొన 65 డిగ్రీల సెల్సియస్, తెల్ల సొన 85 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతల వద్ద గట్టిపడటం మొదలవుతుంది. 12 నిమిషాల సేపు 100 డిగ్రీల సెల్సియస్ వద్ద పెంకులోనే పచ్చ సొన, తెల్ల సొనలు గట్టిపడే వరకు ఉడికించినపుడు, గుడ్డులోని అన్ని భాగాల అంతిమ ఉష్ణోగ్రత 100 డిగ్రీలు ఉంటుంది. ఇది వంటకు, మరీ ముఖ్యంగా పచ్చ సొన విషయంలో సరైన ఉష్ణోగ్రత కన్నా ఎక్కువని శాస్త్రవేత్తలు తమ అధ్యయనంలో తేల్చారు. ఎగ్ సాస్ విషయంలో అయితే గుడ్డును 60-70 డిగ్రీల మధ్యలో ఉడికించినపుడు, అంతిమ గుడ్డు ఉష్ణోగ్రత 65 డిగ్రీలు ఉంటుంది. 100 డిగ్రీల వద్ద ఆరు నిమిషాలపాటు ఉడికిస్తే, పచ్చ సొన సరిగ్గా ఉడకదు. గుడ్డు సక్రమంగా ఉడకాలంటే, 100 డిగ్రీల వద్ద బాయిలింగ్ వాటర్ సాస్‌ప్యాన్‌ను, 30 డిగ్రీల వద్ద (నులివెచ్చని) నీటితో సాస్‌ప్యాన్‌ను ఉపయోగించాలి. గుడ్డును ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి వీటిలో ఒక దాని నుంచి మరొకదానికి మార్చాలి. సరిగ్గా 32 నిమిషాలపాటు ఈ విధంగా చేస్తే గుడ్డు రుచికరంగా, మంచి పోషక విలువలతో ఉడుకుతుంది.



## పోర్టర్ బైక్‌పై... హ్యూమన్ పార్సిల్!

బెంగళూరు, ఫిబ్రవరి 7: ప్రజలు తమ తమ గమ్య స్థానాలను చేరడానికి రేపిడో, ఓలా బైక్‌లపై వెళ్లడం మనకు తెలుసు. అయితే బెంగళూరుకు చెందిన ఒక వ్యక్తి ఆఫీస్‌కు వెళ్లేందుకు ఓలా, ఊబర్‌లు దొరక్కపోవడంతో వినూత్నంగా ఆలోచించాడు. తనను తాను పార్సిల్‌గా పేర్కొంటూ సరుకులు రవాణా చేసే పోర్టర్ కొరియర్‌కు చెందిన బైక్‌ను ఎక్కి ఆఫీస్‌కు చేరుకున్నాడు. పోర్టర్ బైక్‌ల ద్వారా చిన్న చిన్న సామాన్లు, కొరియర్లను నగరంలో రవాణా చేస్తుంటారు. వారు మనుషులను ఎక్కించుకోరు. అయితే తనను తాను ఒక పార్సిల్‌గా పేర్కొంటూ పాథిక్ అనే వ్యక్తి బైక్ బుక్ చేసి ఆఫీస్‌కు చేరుకున్నాడు.



## మన మెదళ్లలోకీ నానో ప్లాస్టిక్!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్లాస్టిక్ రేణువులు (నానో ప్లాస్టిక్స్) క్రమంగా మానవుల శరీరంలోని అన్ని అవయవాల్లోకి చేరుతున్న సంగతి తెలిసిందే. కాలేయం, కిడ్నీలు సహా మెదడులోనూ అవి తిష్ఠ వేస్తున్నాయి. జర్నల్ నేచర్ మెడిసిన్ కథనం ప్రకారం, 2016 నాటి శవ పరీక్షలతో పోల్చితే.. మెదడులో ప్లాస్టిక్ రేణువుల పరిమాణం 50 శాతం పెరిగింది. '45 నుంచి 50 ఏండ్ల సగటు వయస్సు కలిగిన వ్యక్తుల్లోని మెదడు కణజాలంలో ఒక గ్రాముకు 4,800 మిల్లీగ్రాముల ప్లాస్టిక్ రేణువులు ఉన్నాయి. ఇవి నమ్మశక్యం కానంతగా ఉన్నాయి' అని యూనివర్సిటీ ఆఫ్ మెక్సికో సైంటిస్టు మాథ్యూ క్యాంపెన్ చెప్పారు.

# ఫలితాల ముందే | ఆపరేషన్ కమలం!

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు రోజు కేజ్రీవాల్ ఇంటికి ఏసీబీ
- ఒక్కో ఆప్ అభ్యర్థికి బీజేపీ 15 కోట్లు ఎర వేసిందని ఆప్ అధినేత ఆరోపణ
- కేజ్రీవాల్ ఆరోపణలపై ఎల్జీకి బీజేపీ ఢిల్లీ కార్యదర్శి విష్ణు మిట్టల్ లేఖ
- ఎల్జీ ఆదేశంతో రంగంలోకి ఏసీబీ



కేజ్రీవాల్ ఇంటి ముందు ఏసీబీ అధికారులు, ఆయన తరఫు న్యాయవాదులు

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు ఒక రోజు ముందు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్ ఇంటికి ఏసీబీ వెళ్లింది. తమ ఎమ్మెల్యే అభ్యర్థులను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శుక్రవారం సంచలన ఆరోపణలు చేయడంతో దేశ రాజధానిలో హైడ్రామా నడిచింది. ఎన్నికల్లో పోటీ చేసిన ఆప్ అభ్యర్థులలో 16 మందిని తమ పార్టీలోకి మారాలంటూ బీజేపీ ప్రలోభ పెట్టిందని, ఒక్కో అభ్యర్థికి రూ.15 కోట్ల నగదు, మంత్రి పదవి ఇస్తామంటూ బీజేపీ బేరాలు సాగించిందని కేజ్రీవాల్ ఆరోపించారు. ఆప్ నాయకుడు సంజయ్ సింగ్ కూడా ఇవే ఆరోపణలు చేశారు. ఆప్ నాయకులు చేసిన ఆరోపణలపై ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా స్పందించారు. బీజేపీపై ఆప్ చేసిన "ఆపరేషన్ కమలం" ఆరోపణలపై దర్యాప్తు జరపాలని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)ను ఆయన ఆదేశించారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ శుక్రవారం కేజ్రీవాల్‌కు లీగల్ నోటీసు జారీ చేసింది. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ముందు తమ పార్టీ అభ్యర్థులను ప్రలోభ పెట్టేందుకు బీజేపీ ప్రయత్నించిందన్న ఆరోపణలకు సంబంధించిన వివరాలు, సాక్ష్యాలు అందచేయాలని కోరింది. కేజ్రీవాల్‌కు ఆయన నివాసంలో ఏసీబీ నోటీసు అందచేసింది. కాగా, అంతకుముందు, ఆపరేషన్ కమలం ఆరోపణలపై ప్రశ్నించేందుకు కేజ్రీవాల్ నివాసానికి వెళ్లిన ఏసీబీ అధికారులు లోపలకు ప్రవేశించడానికి అనుమతి లభించలేదు. కేజ్రీవాల్‌పై చర్యలు తీసుకునే అధికారం ఏసీబీకి లేదని ఆయన తరఫు న్యాయవాది స్పష్టం చేశారు. ఎన్నికల ఫలితాల ముందు రోజు రాజకీయ డ్రామా సృష్టించేందుకు బీజేపీ పన్నిన కుట్రగా ఈ పరిణామాన్ని ఆయన అభివర్ణించారు. ఢిల్లీ బీజేపీ కార్యదర్శి విష్ణు మిట్టల్ చేసిన ఫిర్యాదుపై ఎల్జీ సక్సేనా ఏసీబీ దర్యాప్తునకు ఆదేశించారు. ఆప్ నాయకులు కేజ్రీవాల్,సంజయ్ సింగ్ చేసిన ఆపరేషన్ కమలం ఆరోపణలు చాలా తీవ్రమైనవని, ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించి వెంటనే దర్యాప్తు జరిపించాలని లెఫ్టినెంట్ గవర్నర్‌కు మిట్టల్ లేఖ రాశారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆప్ నాయకుడు సంజయ్ సింగ్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ నేతల ఆపరేషన్ కమలంపై ఫిర్యాదు చేసేందుకు తాను ఏసీబీ కార్యాలయానికి వెళుతున్నట్టు తెలిపారు. ఆప్ ఆరోపణలకు ఆధారాలు లేవంటున్న బీజేపీ వాదనను విలేకరులు ప్రస్తావించగా ఆప్ అభ్యర్థులను ప్రలోభ పెట్టిన వ్యక్తి ఫోన్ నంబర్ గురించి తాను వెల్లడించానని, ఇంతకన్నా ఇంకేం ఆధారాలు కావాలని ఆయన ప్రశ్నించారు.

**ఎవరి ధీమా వారిదే!**

వరుసగా నాలుగో పర్యాయం అధికారాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చేపడుతుందా లేక 27 ఏండ్ల విరామం అనంతరం మళ్లీ దేశ రాజధానిలో ప్రభుత్వ పగ్గాలను బీజేపీ చేజిక్కించుకుంటుందా అన్న విషయం మరి కొన్ని గంటల్లో తేలిపోనున్నది. ఈ ఎన్నికల్లో తమ పార్టీ 50 సీట్లు గెలవడం ఖాయమని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ శుక్రవారం విశ్వాసం ప్రకటించారు. అయితే మళ్లీ గెలుపు తమదేనని, తమ పార్టీయే మళ్లీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని ఆప్ నాయకులు నమ్మకంగా ఉన్నారు. మరోవైపు ఈసారి ఢిల్లీలో తాము పాగా వేస్తామని కమలనాథులు విశ్వాసం వ్యక్తం చేశారు. శనివారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నది. మొదటి కొన్ని గంటల్లోనే ఫలితాల సరళి వెల్లడయ్యే అవకాశం ఉంది. ఫలితాలపై అందరిలోనూ ఆసక్తి నెలకొనడం, ఎమ్మెల్యే అభ్యర్థుల కొనుగోలు ఆరోపణలు రావడం తదితర కారణాల నేపథ్యంలో కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రతా ఏర్పాట్లు చేసినట్టు ఎన్నికల కమిషన్ అధికారులు తెలిపారు. లెక్కింపు కేంద్రాల్లోకి సెల్ ఫోన్లు తీసుకెళ్లడం నిషేధించామని తెలిపారు.

## మరో 487 మందికి బహిష్కరణ ముప్పు

**యూఎస్‌లో మనవాళ్ల డిపోర్టేషన్‌పై కేంద్ర విదేశాంగ శాఖ ప్రకటన**



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: అమెరికాలో అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ ప్రభుత్వం మరింత దూకుడుగా వ్యవహరిస్తున్నది. ఇప్పటికే 104 మంది భారతీయులకు సంకెళ్లు వేసి సైనిక విమానంలో అమృత్‌సర్‌కు పంపిన ట్రంప్ సర్కారు.. తాజాగా మరికొందరు భారతీయులను వెనక్కి పంపేందుకు సిద్ధమవుతున్నది. ప్రస్తుతం అక్కడ 487 మంది భారతీయులు డిపోర్టేషన్ ముప్పును ఎదుర్కొంటున్నారని, వారంతా తుది బహిష్కరణ జాబితాలో ఉన్నట్టు అమెరికా ప్రభుత్వం భారత్‌కు తెలియజేసిందని విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ వెల్లడించారు. శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అమెరికాకు అక్రమంగా వలస వెళ్లినట్టు గుర్తించిన భారతీయులను సురక్షితంగా, గౌరవప్రదంగా భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు.

**12 నుంచి అమెరికాలో మోదీ పర్యటన**

ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 12,13 తేదీల్లో అమెరికాలో పర్యటించనున్నారు. రెండో పర్యాయం ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ ఆయనను మొదటిసారి కలవనున్నారు. భారత్ దిగుమతులపై సుంకాల విధింపు, అక్రమ వలసదారులను భారత్‌కు పంపివేత తదితర అంశాలతో పాటు పలు ద్వైపాక్షిక విషయాలు చర్చించనున్నారు.

## గర్భిణిపై రేప్‌కు యత్నించి..తోసేసి.. కదులుతున్న రైల్లో దురాగతం

**బాధితురాలు కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలు**



కోయంబత్తూర్, ఫిబ్రవరి 7: గర్భిణిపై లైంగిక దాడికి యత్నించిన ఓ దుండగుడు ఆమెను నిర్దాక్షిణ్యంగా రైలు నుంచి తోసేశాడు. గురువారం తమిళనాడులోని కోయంబత్తూర్ జిల్లాలో ఉదయం 10 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో బాధితురాలి కాలు, చేతులకు, తలకు గాయాలయ్యాయి. రైల్వే అధికారులు ఆమెను వెల్లూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించి వైద్య చికిత్స అందిస్తున్నారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. నిందితుడు హేమరాజ్‌ను అరెస్టు చేసినట్టు తెలిసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలు రేవతి(36) ఆంధ్రప్రదేశ్ చిత్తూరులోని తల్లి ఇంటికి వెళ్లేందుకు తిరుప్పూర్‌లో కోయంబత్తూర్-తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కారు. రైలు జోలార్‌పెట్టాయి స్టేషన్‌కు చేరుకోగానే మహిళల కోచ్‌లో ఆమె పక్కన కూర్చున్న ఆడవాళ్లందరూ దిగిపోయారు. రైలు కదులుతుండగా రేవతి ఉన్న బోగీలోకి ఎక్కిన హేమరాజ్(27) అనే వ్యక్తి ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె అతడిని తీవ్రంగా ప్రతిఘటించింది. నిందితుడు వెంటనే ఆమెను కదులుతున్న రైలు నుంచి తోసేశాడు.

## మార్చి 7 నుంచి హెచ్-1బీ వీసా క్యాప్ రిజిస్ట్రేషన్లు

**భారీగా ఫీజుల పెంపు**

వాషింగ్టన్ : 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను అమెరికన్ హెచ్-1బీ వీసా క్యాప్ రిజిస్ట్రేషన్లు మార్చి 7న ప్రారంభమై, అదే నెల 24న ముగుస్తాయి. నిరుడు ఈ ఫీజు ఒక్కొక్క లబ్ధిదారుడికి 10 డాలర్లు ఉండేది, దీనిని 125 డాలర్లకు పెంచారు. జో బైడెన్ అడ్మినిస్ట్రేషన్ ప్రవేశపెట్టిన విధానాల్లో భాగంగా ఈ చర్యలు తీసుకున్నారు. దీని కోసం అనుసరించే బెనిఫిషియరీ సెంట్రిక్ సిస్టమ్‌లో ఒక బెనిఫిషియరీ(లబ్ధిదారు) తరఫున అనేక రిజిస్ట్రేషన్లను సమర్పించినప్పటికీ, లాటరీలో కేవలం ఒకసారి మాత్రమే ప్రవేశించే అవకాశం ఉంటుంది. బెనిఫిషియరీ పాస్‌పోర్ట్ నంబరును ఉపయోగిస్తారు. కాబట్టి అదే ప్రత్యేక గుర్తింపుగా ఉంటుంది. అందువల్ల ఎన్నిసార్లు లాటరీలో ప్రవేశించారో తెలిసిపోతుంది.

## యెడియూరప్పకు చుక్కెదురు

**పోక్సో కేసు కొట్టివేతకు హైకోర్ట్ నిరాకరణ**

బెంగళూరు, ఫిబ్రవరి 7: బీజేపీ నేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యెడియూరప్పకు హైకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన పోక్సో కేసు కొట్టేయాలన్న ఆయన అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. అయితే ఈ కేసులో పోలీసులు అరెస్ట్ చేయకుండా ఆయనకు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. క్రిమినల్ కేసును తిరిగి ట్రయల్ కోర్టుకు బదిలీ చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం పాక్షికంగా ఆమోదం తెలియజేసింది.

## 700 మంది ట్రైనీల నిర్బంధ తొలగింపు!

**కోతలు మొదలెట్టిన ఇన్ఫోసిస్**

మైసూరు: దేశీయ టెక్ దిగ్గజం ఇన్ఫోసిస్ తన మైసూరు క్యాంపస్‌లో సుమారు 700 మంది ట్రైనీలను ఉద్యోగం నుంచి తొలగించింది. వీరిని నిరుడు అక్టోబరులోనే నియమించుకుంది. ఈ చర్యను నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎంప్లాయీస్ సెనేట్ (ఎన్ఐటీఈఎస్) ఖండించింది. కొందరు ఉద్యోగులు మాట్లాడుతూ, కనీస అర్హతలను సాధించలేకపోయారంటూ దాదాపు 400 మంది ఉద్యోగులను పిలిచి, అల్టిమేటమ్ లేఖలు ఇచ్చిందని చెప్పారు. దీనిపై ఇన్ఫోసిస్ స్పందిస్తూ, 350 మంది కన్నా తక్కువ మందినే తొలగిస్తున్నామని చెప్పింది. ఉద్యోగులను నిర్బంధించి మ్యూచువల్ సెపరేషన్ లెటర్స్‌పై సంతకాలు చేయించుకున్నారని ఎన్ఐటీఈఎస్ ప్రెసిడెంట్ హర్‌ప్రీత్ సింగ్ సలుజ ఆరోపించారు.

## అది అరెస్టు వారెంట్ కాదు

**తప్పుడు కథనాలపై సోనూసూద్ స్పందన**

ముంబై: మోసానికి పాల్పడిన కేసులో లూధియానా కోర్టు నుంచి అరెస్టు వారెంట్ జారీ అయినట్టు ఇటీవల సోషల్ మీడియాలో వచ్చిన వార్తలపై సినీ నటుడు సోనూసూద్ శుక్రవారం స్పందించారు. ఈ వార్తను సంచలనాత్మకం చేశారని, చిలువలు పలువలు చేసి వార్తలు రాశారని మూడో పార్టీకి సంబంధించిన కేసులో సాక్షిగా హాజరు కావాలని తనను కోర్టు ఆదేశించిందని, ఆ కేసుతో తనకు సంబంధం లేదని వివరణ ఇచ్చారు. తన లాయర్లు స్పందించారని, ఫిబ్రవరి 10న ఈ వ్యవహారంలో తమకు ఎటువంటి సంబంధం లేదని స్పష్టం చేస్తూ ఓ ప్రకటన ఇస్తామని ఆయన తెలిపారు.

## ఐటీ బిల్లుకు క్యాబినెట్ ఆమోదం

**'స్కిల్ ఇండియా'కు ఎనిమిది వేల కోట్లు**

న్యూఢిల్లీ: ఆదాయ పన్ను(ఐటీ) బిల్లుకు కేంద్ర క్యాబినెట్ శుక్రవారం ఆమోదం తెలిపింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో కొన్ని ముఖ్యమైన నిర్ణయాలకు ఆమోదం లభించింది. ఐటీ బిల్లును ఈ నెల 10న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు తెలిపాయి. పన్నుల వ్యవస్థ సంస్కరణలో భాగంగా ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం రూపొందించింది. ప్రత్యక్ష పన్నుల కోడ్‌గా పిలిచే ఈ కొత్త చట్టం ప్రస్తుత పన్ను స్వరూపం ప్రక్షాళనతోపాటు మరింత క్రమబద్ధీకరణ, పారదర్శకతకు ఉద్దేశించబడినదని వారు చెప్పారు. నేషనల్ కమిషన్ ఫర్ సఫాయీ కరంచారీ కాల పరిమితిని మూడేండ్లు పొడిగిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. 2025 మార్చి 31న ప్రస్తుత కమిషన్ కాల పరిమితి ముగియనుంది. స్కిల్ ఇండియా ప్రోగ్రామ్‌ను రూ.8,800 కోట్ల వ్యయంతో 2026 వరకు కొనసాగించేందుకు క్యాబినెట్ పచ్చ జెండా ఊపింది. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ వివరాలు మీడియాకు వెల్లడించారు.

## పాక్ దాడిని తిప్పికొట్టిన భారత్

**ఏడుగురు చొరబాటుదారుల హతం**

శ్రీనగర్: నియంత్రణ రేఖ (ఎల్ఓసీ) వెంబడి కృష్ణ ఘాటి సెక్టార్‌లో పొంచి ఉండి భారత్‌పై దాడి చేసేందుకు పాకిస్థాన్ విఫలయత్నం చేసింది. భారత్ సైనిక స్థావరంపై దాడి చేసేందుకు పాకిస్థానీలు చేసిన ప్రయత్నాన్ని భారత్ సైన్యం తిప్పికొట్టింది. ఈ ఘటనలో ఏడుగురు పాక్ చొరబాటుదారులు మరణించారు. వీరిలో ఇద్దరు లేదా ముగ్గురు పాక్ సైనికులని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. మిగిలినవారు అల్ బద్ర్ ఉగ్రవాద సంస్థకు చెందినవారై ఉండవచ్చునని తెలుస్తున్నది. ఈ ఘటన జమ్ము కశ్మీరులోని పూంఛ్ జిల్లాలో ఈ నెల 4-5 తేదీల మధ్య రాత్రి జరిగింది. భారత వ్యతిరేక ఎజెండాతో పాకిస్థాన్ ఏటా కశ్మీరు సంఘీభావ దినాన్ని నిర్వహిస్తూ ఉంటుంది. ఈ సందర్భంగా ఈ దాడికి పాల్పడిందని ఆర్మీ అధికారులు తెలిపారు.



**చొరబాటుదారులకు పాక్ ఆర్మీ శిక్షణ**

ఇటీవల కాలంలో జమ్ముకశ్మీర్‌పై ఉగ్రదాడులకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అయితే ఇలా దాడులకు పాల్పడే ఉగ్రవాదులకు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లో స్వయంగా పాకిస్థాన్ ఆర్మీయే శిక్షణ ఇస్తున్న చిత్రాలు ఇటీవల వెలుగుచూశాయి. పీఓకేలోని కొట్లి ప్రాంతంలో కొంతమందికి శిక్షణ ఇస్తున్నారు. కిరాయి సైనికులతో ఉండే ఒక్కో గ్రూప్‌కు కనీసం రూ.1 లక్ష చెల్లిస్తున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. వీరికి అత్యాధునికమైన ఖరీదైన ఆయుధాలు, ఎం4 రైఫిల్స్, చైనా ఆయుధ సంపత్తి, బుల్లెట్లు అందజేస్తున్నది.

## ఏడుగురు బంగ్లాదేశీ చొరబాటుదారుల అరెస్టు

కోల్‌కతా, ఫిబ్రవరి 7: పశ్చిమ బెంగాల్‌లోని నాదియా, ముర్షిదాబాద్ జిల్లాలలో భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి జరిగిన భారీ ఆపరేషన్‌లో ఏడుగురు బంగ్లాదేశీ చొరబాటుదారులు, ముగ్గురు భారతీయ దళారులను బీఎస్ఎఫ్ సిబ్బంది శుక్రవారం నిర్బంధించారు. ఫిబ్రవరి 6 తెల్లవారుజామున 5 గంటలకు బీఎస్ఎఫ్ ఆపరేషన్ ప్రారంభమైంది. సరిహద్దుల మీదుగా భారత్ నుంచి బంగ్లాదేశ్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నిస్తున్న ఏడుగురు చొరబాటుదారులను గమనించిన బీఎస్ఎఫ్ సిబ్బంది వారిలో ఇద్దరిని వెంటనే అదుపులోకి తీసుకున్నారు. తప్పించుకున్న ఐదుగురు బంగ్లాదేశీయులు వెనుదిరిగి భారత్ సరిహద్దుల్లోకి పరుగులు తీశారు. వారి కోసం వేట ప్రారంభించిన బీఎస్ఎఫ్ జవాన్లు నిఘా వర్గాల సమాచారంతో అక్రమ సరిహద్దు చొరబాట్లకు సహకరిస్తున్న ముగ్గురు భారతీయ దళారులను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారం మేరకు గోపాల్‌పూర్ సమీపంలో ఓ అరటి తోటలో దాక్కుని ఉన్న ఐదుగురు బంగ్లాదేశీయులను నిర్బంధించారు. అక్రమ చొరబాట్ల కోసం దళారులు ఒక్కో వ్యక్తి నుంచి రూ. 7,000 వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు.

## బిల్లులపై మీ అభిప్రాయం చెప్పకుంటే కుదరదు

**తమిళనాడు గవర్నర్ తీరుపై సుప్రీం కోర్టు**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: బిల్లుల విషయంలో తమిళనాడు గవర్నర్ అనుసరిస్తున్న తీరును సుప్రీం కోర్టు తప్పు బట్టింది. రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా శాసనసభ ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదం తెలపకుండా తన వద్ద ఉంచుకుంటే ఎలా? అని ప్రశ్నించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ తగవు ఎలా పరిష్కారమవుతుందని ఆశ్చర్యం వ్యక్తం చేసింది. తమిళనాడు గవర్నర్ బిల్లులపై ఎలాంటి అభిప్రాయాన్ని తెలియజేయకుండా వ్యవహరించరాదని జస్టిస్‌లు జేబీ పార్థివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రం ఆమోదించి పంపిన బిల్లులపై గవర్నర్‌కు వ్యతిరేకత ఉంటే ఆ విషయం ప్రభుత్వానికి తెలియజేయాల్సిన అవసరం లేదా? గవర్నర్ మదిలో ఏముందో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలా తెలుస్తుందని గవర్నర్ తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్ వెంకట రమణిని ధర్మాసనం ప్రశ్నించింది. ఆ బిల్లు ప్రతికూలంగాఉందని గవర్నర్ భావిస్తే, అది నచ్చకపోతే, అదే విషయాన్ని తెలియజేస్తూ దానిని పునః పరిశీలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని గవర్నర్ కోరాలి కదా? అని పేర్కొంది.

- కుంభమేళాలో మరో అగ్ని ప్రమాదం


మహా కుంభమేళా జరుగుతున్న యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో మరోసారి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శంకరాచార్య మార్గ్, సెక్టార్ 18, మహా కుంభ్‌నగర్‌లో ఇస్కాన్ శిబిరంలోని టెంట్‌కు శుక్రవారం నిప్పంటుకుంది. ఈ ప్రమాదంలో 20 నుంచి 22 టెంట్లు వరకు కాలిపోయాయని అధికారులు తెలిపారు.

## మోటార్ డీలర్‌కు 500 కోట్లు రాసిచ్చారు

**జంషెడ్‌పూర్ వాసికి రతన్ టాటా ఆస్తిలో వాటా**

వీలునామాలో పేర్కొన్న రహస్య వ్యక్తి ఆయనే



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7: ప్రఖ్యాత వ్యాపారవేత్త, నైతిక విలువలకు మారుపేరుగా నిలిచిన రతన్ టాటా వీలునామాకు సంబంధించిన ఆసక్తికర విషయం ఒకటి బయటకొచ్చింది. నిరుడు అక్టోబర్ 9న రతన్‌టాటా మరణించాక ఆయన ఓ వ్యక్తికి తన ఆస్తిలో రూ.500 కోట్లు ఇవ్వాలని వీలునామాలో రాశారన్న విషయం సంచలనం కలిగించింది. ఇప్పుడు ఆ వ్యక్తి ఎవరో తెలిసింది. ఆయన జంషెడ్‌పూర్‌కు చెందిన మోటార్ డీలర్, స్టాలియన్ కంపెనీ యజమాని మోహినీ మోహన్ దత్తా అని తెలిసింది. స్టాలియన్ కంపెనీ టాటా గ్రూప్‌లో విలీనమైంది. అంతకుముందు స్టాలియన్ కంపెనీలో దత్తాకు 80 శాతం, టాటా గ్రూప్‌కు 20 వాటా ఉండేది. టాటా కుటుంబంలో, వ్యాపార వర్గాల్లో మోహినీ మోహన్ దత్తా పేరు పెద్దగా ఎవరికీ తెలియదు. రతన్ టాటా అంతిమ సంస్కారాలకు హాజరైన సందర్భంగా మోహినీ మోహన్ దత్తా టాటాతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

# సీపీఆర్వో ఎవరు?

- అధికారిక ఉత్తర్వుల్లో అయోధ్యరెడ్డి
- దావోస్ పర్యటనకు వెళ్లింది ఉదయసింహా
- రోహిన్‌రెడ్డిని తీసుకెళ్లడంపైనా విమర్శలు

హైదరాబాద్, ఫిబ్రవరి 7 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ (సీపీఆర్వో) ఎవరు? అనేది ఇప్పుడు ప్రభుత్వ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం 2023 డిసెంబర్‌లో సీనియర్ జర్నలిస్ట్, కాంగ్రెస్ నేత అయోధ్య రెడ్డిని సీపీఆర్వోగా నియమించింది. అప్పటి నుంచి ఆయనే సీపీఆర్వోగా కొనసాగుతున్నారు. అయితే.. గత నెలలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సుకు మాత్రం సీపీఆర్వో స్థానంలో ఉదయసింహా వెళ్లారు. ఈయన ఓటుకు నోటు కేసులో మూడో నిందితుడు (ఏ-3)గా ఉన్నారు. మహారాష్ట్రకు చెందిన అజయ్ వాసుదేవ్‌బోస్ అనే వ్యక్తి ఇటీవల దావోస్ పర్యటనకు సంబంధించిన వివరాలను ఆర్టీఐ ద్వారా తీసుకున్నారు. కేంద్ర, రాష్ట్రాల నుంచి పర్యటించిన బృందాలు, వారి ఆతిథ్యం కోసం స్విట్జర్లాండ్‌లోని భారత ఎంబసీ చేసిన ఖర్చు వివరాలను ఆయన పొందారు. కేంద్రం ఇచ్చిన సమాధానం ప్రకారం.. తెలంగాణ నుంచి దావోస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి సహా మొత్తం 18 మంది తరలివెళ్లారు. ఇందులో ఉదయ్‌సింహాను సీపీఆర్వోగా పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వం సీపీఆర్వోను ఎప్పుడు మార్చింది? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక ఉత్తర్వుల్లో సీపీఆర్వోగా అయోధ్యరెడ్డి ఉండగా, దావోస్ పర్యటనకు ఉదయసింహాను సీపీఆర్వోగా ఎలా తీసుకెళ్లారని ప్రశ్నిస్తున్నారు. పైగా సీఎం రేవంత్‌రెడ్డి నిందితుడిగా ఉన్న కేసులోని నిందితుడిని తీసుకెళ్లడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం ఉదయ్‌సింహ విషయంలో కేంద్ర ప్రభుత్వానికి తప్పుడు సమాచారం ఇచ్చిందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదే నిజమైతే జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం పరువు పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ నేత కొణతం దిలీప్ విమర్శలు గుప్పించారు. 'ఓటుకు నోటు కేసులో బ్యాగ్ మోసిన ఉదయ్‌సింహా సీఎం పీఆర్వో ఎప్పుడయ్యారు?' అని ప్రశ్నించారు. సాధారణంగా సీపీఆర్వో ఒక్కరే ఉంటారని చెప్పారు. 'ప్రస్తుత సీపీఆర్వోగా ఉన్న బోరెడ్డి అయోధ్యరెడ్డి ఉద్యోగం ఉందా? ఊడిందా?' అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'జర్నలిజం, పబ్లిక్ రిలేషన్స్‌లో ఏ అర్హతలూ లేని ఉదయ్‌సింహాను సీపీఆర్వోగా చూపించడం ఏమిటి? తనతోపాటు నేరంలో పాల్గొని, జైలు పాలైనందుకే ఉదయ్‌సింహాకు రేవంత్‌రెడ్డి ఈ నజరానా ఇచ్చారా?' అని ప్రశ్నించారు.



**రోహిన్ రెడ్డి ఎందుకు?**

సీఎంతోపాటు దావోస్‌కు వెళ్లిన బృందంలో రోహిన్‌రెడ్డి కూడా ఉన్నారు. ఆయన హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నారు. పెట్టుబడులను ఆకర్షించేందుకు వెళ్లిన బృందంలో రోహిన్‌రెడ్డి ఎందుకు ఉన్నట్టు? అని ప్రశ్నిస్తున్నారు. ఆయన వృత్తిరీత్యా డాక్టర్ (డెంటిస్ట్) అని, రియల్ ఎస్టేట్, ఫైనాన్స్ వ్యాపారాలు ఉన్నాయని చెప్తున్నారు. రోహిన్‌రెడ్డి వృత్తికి, దావోస్‌కు సంబంధం లేదని అంటున్నారు. కేవలం సీఎం సన్నిహితుడనే కారణంతోనే ఆయనను దావోస్‌కు తీసుకెళ్లారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# పెండింగ్ బిల్లులపై చలో కొడంగల్

- సీఎం సొంత నియోజకవర్గం నుంచే సమరశంఖం
- బిల్లుల జాప్యంపై విసిగివేసారిన మాజీ సర్పంచ్‌లు
- త్వరలోనే జేఏసీ ఉద్యమ కార్యాచరణ

హైదరాబాద్, ఫిబ్రవరి 7(నమస్తేతెలంగాణ): పెండింగ్ బిల్లుల కోసం ఎన్నిసార్లు వినతులు సమర్పించినా రాష్ట్ర సర్కారు నుంచి సరైన స్పందనలేకపోవడంతో సర్పంచ్‌ల జేఏసీ ఇక తాడోపేడో తేల్చుకోవాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి, మంత్రులు, ఉన్నతాధికారులకు ఎన్నిసార్లు విన్నవించి, నిరసనలు తెలిపినా పట్టించుకోకపోవడంతో సమరశంఖం పూరించేందుకు సిద్ధమైంది. ఏకంగా ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్ నుంచే ఉద్యమాన్ని ప్రారంభించేందుకు కార్యాచరణ రూపొందిస్తుంది. దీనికి సంబంధించి మరో రెండు, మూడు రోజుల్లో ప్రణాళిక ప్రకటించే అవకాశం ఉంది.

**ఖజానాలో నిధులు లేవని సీఎం సాకులు..**

అధికారంలోకి వచ్చిన వెంటనే సర్పంచ్‌ల బిల్లులు చెల్లిస్తామని అప్పటి పీసీసీ చీఫ్ హోదాలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి పదేపదే చెప్పారు. ఇందిరాపార్క్ వద్ద నిర్వహించిన ధర్నా సందర్భంగా స్పష్టమైన హామీ కూడా ఇచ్చారు. కానీ గద్దెనెక్కిన తర్వాత ఖజానాలో నిధులు లేవని సాకులు వెతుకుతున్నాడు. గత డిసెంబర్‌లో నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లోనూ త్వరలోనే చెల్లిస్తామని చెప్పిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క నిర్ణీత గడువు మాత్రం చెప్పకపోవడం గమనార్హం.

**అటు వినతులు..ఇటు నిరసనలు..**

తెలంగాణ రాష్ట్ర సర్పంచ్‌ల జేఏసీ ఆధ్వర్యంలో మాజీ సర్పంచ్‌లు బిల్లుల కోసం ముఖ్యమంత్రి, మంత్రులు, అధికారులు, సీఎంవో ప్రత్యేక కార్యదర్శికి అనేకసార్లు విన్నవించారు. ప్రజాభవన్‌లో నిర్వహించే ప్రజావాణిలో దరఖాస్తులు సైతం సమర్పించారు. అయినా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటన రాకపోవడంతో గతేడాది అక్టోబర్ 4న సెక్రటేరియట్ వద్ద నిరసన తెలిపారు. నవంబర్ 10న గన్‌పార్క్ వద్ద సుమారు రెండు వేలమంది మాజీ సర్పంచ్‌లు ఆందోళనకు దిగారు. తాజాగా ఫిబ్రవరి 5న చలో సెక్రటేరియట్ చేపట్టారు.

**త్వరలోనే 'చలో కొడంగల్'**

ఎన్నిసార్లు ఆందోళనలు చేసినా సర్కారులో చలనం లేకపోవడంతో విసిగివేసారిన సర్పంచ్‌ల జేఏసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజక వర్గం నుంచే కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం తీర్మానం చేసి, చలో కొడంగల్‌కు పిలుపునిచ్చారు. త్వరలోనే తేదీని ప్రకటిస్తామని రాష్ట్ర సర్పంచ్‌ల జేఏసీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి మాజీ సర్పంచ్‌లు తరలివచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని పేర్కొన్నారు.